ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న యువకులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని పోచమ్మ దేవాలయ అభివృద్ధికి స్థానిక యువత విరాళం అందించారు. స్థానికంగా ఉండే యువకులు చందాలను పోగు చేసి రూ.55,501లను ఆలయ ధర్మకర్తలు ఎస్‌ నర్సింహారెడ్డి, ముత్యంరెడ్డిలకు మంగళవారం చెక్కు రూపంలో అందజేవారు. ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించుకోవాలని కోరారు. నిధులను అందించిన వారిలో స్థానిక బొర్రాఅరవింద్‌, బి కిరణ్‌గౌడ్‌, కొత్తపల్లి సంజీవరెడ్డి, కుర్మా శ్రీనివాస్‌యాదవ్‌, బొర్రాతులసి, కె హరీష్‌గౌడ్‌, బొర్రాప్రశాంత్‌, ఎస్‌ భానుప్రకాశ్‌ రెడ్డి, ఎస్‌ నరేందర్‌రెడ్డి, బొర్రా నాగార్జున, మేకల చైతన్య, ఎస్‌ మహేష్‌గౌడ్‌ ఉన్నారు.

బెటాలియన్‌లో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న కమాండెంట్‌ సన్నీ తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో మంగళవారం వనమహోత్సవాన్ని చేపట్టారు. కమాండెంట్‌ సన్నీ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బెటాలియన్‌లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్‌ కమాండెంట్‌ బి.వి.రెడ్డి, అసిస్టెంట్‌ కమాండెంట్లు రెహమాన్‌, సీతారాం, నాగభూషణం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే ప్రాణాలకే ముప్పు



అవగాహన కల్పిస్తున్న మాదాపూర్‌ ట్రాఫిక్‌ ఏసీపీ సత్యనారాయణ

గచ్చిబౌలి: మద్యం సేవించి వాహనం నడిపితే జరిగే ప్రమాదాలతో ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని మాదాపూర్‌ ట్రాఫిక్‌ ఏసీపీ కె.సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాలెడ్జీ సిటీలోని మాదాపూర్‌ ట్రాఫిక్‌ పీఎస్‌లో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి తల్లిదండ్రులతో కలిపి అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం పడపడం సురక్షితం కాదని, రెండో సారి పట్టుబడితే జైలు శిక్ష పడుతుందన్నారు. ప్రమాదాల్లో చనిపోతే కుటుంబాలు చాలా నష్టపోతాయన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్‌ చేయకుండా కుటుంబ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎన్‌. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌ ట్రస్ట్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

గచ్చిబౌలి: గురుకుల్‌ ట్రస్ట్‌లో పదుల సంఖ్యలో అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. మంగళవారం చందానగర్‌ సర్కిల్‌ పరిధిలోని గురుకుల్‌ ట్రస్ట్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్‌ ఇండియాలో జోనల్‌ టౌన్‌ ప్లానింగ్‌ అధికారుల పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నోటీసులు జారీ చేసిన అధికారులు కొద్ది రోజులుగా కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆదేశాలతో పదుల సంఖ్యలో వెలసిన అక్రమ నిర్మాణాల స్లాబ్‌లు, పిల్లర్లను నేల మట్టం చేశారు.

సేవలకు గుర్తింపు



ప్రశంసా పత్రం అందుకుంటున్న కొండ విజయ్‌కుమార్‌

హఫీజ్‌పేట్‌: చందానగర్‌కు చెందిన లయన్‌ కొండ విజయ్‌ కుమార్‌ లయన్స్‌ క్లబ్‌లో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ లయన్‌ ఘట్టమనేని బాబురావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో సేవలు అందిస్తునందుకు ఈ ప్రశంసా పత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తానన్నారు. అనంతరం కొండ విజయ్‌కుమార్‌కు పలువురు లయన్స్‌ సభ్యులు, లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హోప్‌ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఫ్లైఓవర్‌ పైనుంచి పడి ఆవు మృతి



గచ్చిబౌలి: కొండాపూర్‌ ఫ్లైఓవర్‌ పైనుంచి కింద పడి ఆవు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కొండాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఒక ఆవు కొండాపూర్‌ ఫ్లైఓవర్‌ మీదకు వచ్చింది. అయితే ఎదురుగా వాహనాలు వస్తుండడంతో ఎటు వెళ్లాలో తెలియక భయంతో కిందకు దూకింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆవును అక్కడి నుంచి తరలించారు.

సర్వం సిద్ధం..

మాన్‌సూన్‌ యాక్షన్‌ ప్లాన్‌ రెడీ ● 65 స్ట్రాటజిక్‌ లేబర్‌ టీమ్‌లు

- 13 మొబైల్‌ మాన్‌ సూన్‌ టీమ్‌లు
- 23 వాహనాలు రెడీ
- వరదను తొలగించేందుకు తక్షణ చర్యలు
- నకాలంలో సహాయక చర్యలు : జడ్సీ జె.శంకరయ్య



కొత్తగూడలో రోడ్డుపై వరద నీరు(ఫైల్‌)

గచ్చిబౌలి: భారీ వర్షాల కారణంగా ఎదరయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ అధికారులు మాన్‌సూన్‌ యాక్షన్‌ ప్లాన్‌ రెడీ చేశారు. త్వరలోనే ఆయా అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు. అత్యవసర సమయంలో వరదను, వర్షం వల్ల ఏర్పడే ఇబ్బందులను తొలగించేందుకు మొబైల్‌ టీమ్‌లను సిద్ధం చేయనున్నారు. మాన్‌సూన్‌ ఎమర్జెన్సీలో భాగంగా వెస్ట్‌ జోనల్‌లో 13 మొబైల్‌ టీమ్‌లు పని చేయనున్నాయి. యూసూఫ్‌గూడ సర్కిల్‌లో 3, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 4, చందానగర్‌ సర్కిల్‌ 2, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిల్‌ 4 మొబైల్‌ టీమ్‌లను అందుబాటులో ఉంచిన్లు వెస్ట్‌ జోనల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు తెలిపారు. వెస్ట్‌ జోనల్‌లోని నాలుగు సర్కిళ్లలోని వాటర్‌ స్టాగ్నేషన్‌ పాయింట్ల వద్ద స్ట్రాటజిక్‌ టీమ్‌లు పని చేయనున్నాయి. ఈ టీమ్‌లు ఆయా సర్కిళ్ల ఈఈల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

రౌండ్‌ ది క్లాక్‌ కంట్రోల్‌ రూమ్‌లు

వర్షా కాలంలో చెట్లు పడిపోవడం, నాలాలు పొంగడం, కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరినా కంట్రోల్‌ రూమ్‌లకు సమాచారం అందించాలి. ఆయా సర్కిళ్లకు త్వరలో కంట్రోల్‌ రూమ్‌ ఫోన్‌ నెంబర్లు కేటాయించనున్నారు. 24 గంటలు కంట్రోల్‌ రూమ్‌ పని చేస్తుంది.

నివారణ చర్యలు ఇవీ..

◆ గచ్చిబౌలి జంక్షన్‌ నుంచి కొండాపూర్‌ వైపు ఫ్లైఓవర్‌ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును మూసివేయడంతో వర్షం వస్తే ఇందిరానగర్‌, డీఎల్‌ఎఫ్‌, అంజయ్యనగర్‌లో ట్రాఫిక్‌ జామ్‌ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

◆ వర్షం వచ్చే సమాచారాన్ని ముందే టీ కారిడార్‌లో పని చేసే వారికి తెలియజేయడం, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.

◆ వరద ఉన్న రహదారుల వైపు వాహనాలు రాకుండా ట్రాఫిక్‌ పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్ల వైపు ట్రాఫిక్‌ను మళ్లించాలి.

◆ నాలాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, మ్యాన్‌ హోల్స్‌లో పూడిక తీస్తే కొంత వరకు సమస్యను తగ్గించేందుకు వీలుంటుంది.





వరద నీటిలో ఐటీ ఉద్యోగుల అవస్థలు (ఫైల్‌)

వాటర్‌ లాగింగ్‌ పాయింట్లు ఇవీ..

శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ పరిధిలోని ఆయా సర్కిళ్లలో భారీ వర్షం వస్తే వాటర్‌ స్టాగ్నేషన్‌ పాయింట్ల వద్ద భారీగా వరద చేరే అవకాశం ఉంది. గచ్చిబౌలిలోని రాడిసన్‌ హోటల్‌ ముందు, డీఎల్‌ఎఫ్‌, బయోడైవర్సిటీ జంక్షన్‌, మాదాపూర్‌ ఫేజ్‌-2, నెక్టార్‌ గార్డెన్‌, మాదాపూర్‌ మెయిన్‌ రోడ్డు, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్‌, లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జ్‌, పాపిరెడ్డినగర్‌ కాలనీ రైల్వే అండర్‌ బ్రిడ్జ్‌, దీప్తిశ్రీనగర్‌, మదీనాగూడ, మియాపూర్‌, ఖాజాగూడ, లిడ్క్యాప్‌ సమీపంలోని జూబ్లీహిల్స్‌ లింకు రోడ్డు తదితర చోట్ల వరద నీరు చేరుతున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు.

సిద్ధంగా ఉన్నాం..



మాన్‌సూన్‌ యాక్షన్‌ ప్లాన్‌ను రెడీ చేశాం. త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమిస్తాం. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పని చేసేందుకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో నాతో పాటు ఉప కమిషనర్లు విధులు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో పని చేసేందుకు మొబైల్‌ టీమ్‌ల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. కంట్రోల్‌ రూమ్‌లు ఎళ్లవేళలా పని చేస్తాయి., వర్షంతో ఇబ్బందులు ఎదురైతే సమాచారం అందించాలి. అత్యవసర సమయాల్లో ప్రజాప్రతినిధులు, వాహనదారులు, స్థానికులు జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్‌ పోలీసులకు సహకారం అందించాలి. – పి.ఉపేందర్‌ రెడ్డి, కమిషనర్‌, వెస్ట్‌ జోన్‌

వర్షం వస్తే గోదారులే

వర్షం వచ్చిందంటే గత కంటె రోడ్లపై వరద నీరు ఎక్కువగా చేరే అవకాశం ఉంది. ఐటీ కారిడార్‌లో 30 కిలో మీటర్ల లక్ష్యంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో చోట్ల వరద నీరు వెళ్లే మార్గాలు మూసుకు పోయాయి. ప్రధాన రహదారుల వెంట వరద కాల్వల నిర్మాణం లేకపోడంతో నాలాలు, మ్యాన్‌ హోళ్లలో చెత్త, చెదారం చేరడంతో కొన్ని చోట్ల వరద రోడ్లపై ప్రవహిస్తోంది. శిల్పారామం, మాదాపూర్‌లోని నెక్టార్‌ గార్డెన్‌, దీప్తి శ్రీనగర్‌, లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు చేరనుంది.

స్పోర్ట్స్‌ అనలిటిక్స్‌ కోసం అధునాతన అల్గారిథమ్‌లు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ స్పోర్ట్స్‌ అనలిటిక్స్‌ కోసం అధునాతన అల్గారిథమ్‌లు, డేటా మోడల్‌లను అభివృద్ధి చేయడానికి అథ్‌లైట్‌ ఇంక్‌ సహకరిస్తుంది. ఈ మోడల్‌లు, అల్గారిథమ్‌లు అథ్లెట్‌ నెక్ట్స్‌ జనరేషన్‌ స్పోర్ట్స్‌ కమ్యూనికేటర్స్‌ టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ మెరుగుపర్చడానికి ఉపయోగపడతాయి. ఈ ప్లాట్‌ఫారమ్‌ యూఎస్‌ కళాశాల స్పోర్ట్స్‌ కమ్యూనికేటర్‌లు గణాంకాలు, ఇతర క్రీడా సమాచారాన్ని శోధించడంలో, అధునాతన భాషా నమూనాలను ఉపయోగించి డేటా నుంచి కథనాలను రూపొందించడంలో ఉపయోగపడుతుంది. ప్రొఫెసర్‌ మనీష్‌ శ్రీవాస్తవ నేతృత్వంలోని ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌ బృందం అథ్లెట్‌ స్పోర్ట్స్‌ డేటా, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన సహజ భాష-ఆధారిత శోధన ఇంజిన్‌ను అభివృద్ధి చేయడం, డేటా మైనింగ్‌, ప్యాటర్న్‌ రికగ్నిషన్‌, ఏఐ ఉపయోగించి స్పోర్ట్స్‌ కంటెంట్‌, స్టోరీలను రూపొందించడం వంటి ప్రాజెక్ట్‌లపై అథ్లెట్‌ బృందం సభ్యులతో సంయుక్తంగా పనిచేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్‌ మనీష్‌ శ్రీవాస్తవ మాట్లాడుతూ సహజ భాషా ప్రాసెసింగ్‌లో ప్రస్తుత పురోగతి, స్పోర్ట్స్‌ అనలిటిక్స్‌ ఈ పురోగతి నుంచి పెద్దగా ప్రయోజనం పొందలేకపోయామన్నారు. ఈ భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో గణనీయమైన ప్రభావాన్ని చూపగలమనే నమ్మకం పెరిగిందన్నారు. అథ్‌లైట్‌ ఇంక్‌ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్‌ కిరణ్‌శాస్త్రి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ, అథ్‌లైట్‌ మధ్య భాగసామ్యం కళాశాల స్పోర్ట్స్‌ కమ్యూనికేటర్‌లను మరింత ప్రభావవంతంగా చేయడంలో సహాయపటానికి అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందన్నారు. ట్రిపుల్‌ఐటీలో సుదీర్ఘమైన, ఫలవంతమైన భాగస్వామ్యం కోసం ఎదురు చేస్తున్నామన్నారు.

అంకితభావంతోనే ఉద్యోగులకు గుర్తింపు



హెచ్‌ఎం అనంతరెడ్డి, ఉపాధ్యాయులను సన్మానించిన రవికుమార్‌యాదవ్‌

గచ్చిబౌలి: బదిలీలు, పదవీ విరమణలు ఉద్యోగులకు సహజమని, అయితే అంకిత భావంతో విధులు నిర్వర్తించినప్పుడే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ అన్నారు. మసీదుబండలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రవికుమార్‌ మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా ఎంతో మంది విద్యార్థులకు తీర్చిదిద్ది, పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వారిని విద్యార్థులు మర్చిపోరన్నారు. 15 ఏళ్లుగా మసీదుబండ పాఠశాల అభివృద్ధిలో అనంతరెడ్డి పాత్ర మరువలేనిదన్నారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు కూడా ఆయన స్ఫూర్తిగా తీసుకొని విధులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ టి రామస్వామియాదవ్‌, పలువురు ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాకారంలో సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రోజారాణి అన్నారు. మున్సిపల్‌ పరిధిలోని పలు కాలనీలలో ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని చక్రపురి కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మున్సిపల్‌ కమిషనర్‌ జ్యోతిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రైవేట్‌ వ్యక్తులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. అయినా టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఇళ్ల పట్టాలను అందించాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఉన్న 729 సర్వే నంబర్‌ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి పట్టాలను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌ నేత రాజుగౌడ్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్‌ మాట్లాడుతూ ఏళ్ల క్రితమే 729 సర్వే నంబర్‌ భూమిలో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. కానీ.. ఇప్పటివరకూ పట్టాలను ఇవ్వలేదన్నారు. అనంతరం కాటా శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ ఈ విషయమై మంత్రి రాజనర్సింహా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జనాబాయి, శ్రీనివాస్‌రెడ్డి, మాదారం గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

ఆల్విన్‌కాలనీ: నేపాల్‌ ఖేలో భారత్‌ యూత్‌ గేమ్స్‌ ఇంటర్నేషనల్‌ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం అభినందించారు. మన తెలంగాణ క్రీడాకారులు ఇండో నేపాల్‌ ఖేలో భారత్‌ యూత్‌ గేమ్స్‌ ఇంటర్నేషనల్‌ ఛాంపియన్‌షిప్‌-2024కి ఎంపికైన సందర్భంగా అభినందిస్తున్నానని తెలిపారు. నేపాల్‌ రంగశాల స్టేడియం పోఖారాలో జూన్‌ 26 నుంచి 30 వరకు పలు రంగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారని తెలిపారు. ఖేలో భారత్‌ యూత్‌ గేమ్స్‌ అథ్లెటిక్స్‌, కరాటే, కబడ్డీ, సిలంబం, యోగా, ఫుట్‌బాల్‌, ఖోఖో, ఎయిర్‌ రైఫిల్‌ షూటింగ్‌, ఆర్చరీ, హ్యాండ్‌ బాల్‌, బ్యాడ్మింటన్‌, బాస్కెట్‌బాల్‌, క్రికెట్‌, తైక్వాండో వంటి పోటీలు నేపాల్‌లో జరిగాయని తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు గోల్డ్‌మెడల్‌, సిల్వర్‌మెడల్స్‌, సిల్వర్‌ మెడల్స్‌ సాధించారని తెలిపారు. విద్యార్థులు, యువత తాము ఎంచుకున్న మార్గాల్లో కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఎంచుకున్న మార్గాల్లో నడవాలన్నారు. పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, జోగిపేట భాస్కర్‌, యశ్వంత్‌ పాల్గొన్నారు.

కాలనీలు, బస్తీలు పచ్చని మణిహారాలు కావాలి

వనమహోత్సవంలో అందరూ పాల్గొనాలి ● ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

- గచ్చిబౌలి, చందానగర్‌ డివిజన్లలో వనమహోత్సవం



జర్నలిస్ట్‌కాలనీలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యేగాంధీ, కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



రాయదుర్గం/హఫీజ్‌పేట్‌: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీలను పచ్చని మణిహారాలుగా తీర్చిదిద్దాలని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం ఆయన గచ్చిబౌలి డివిజన్‌ జర్నలిస్ట్‌ కాలనీలో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, చందానగర్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ మంజులా రఘునాథ్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలను నాటారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడవాడలా వనమహోత్సవాలను అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి దానిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్‌, గేటెడ్‌ కమ్యూనిటీ వాసులు కూడా ముందుకొచ్చి వారి పరిసరాల్లో మొక్కలు నాటేలా చేయాలన్నారు. నాటిన ప్రతి మొక్క చెట్టుగా మారేలా చూడాల్సిన బాధ్యత స్థానికులే తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తమ ప్రాంతాల్లో మొక్కలు నాటేలా చూడాలన్నారు. గచ్చిబౌలి, చందానగర్‌ కార్పొరేటర్లు గంగాధర్‌ రెడ్డి, మంజులా రఘునాథ్‌ రెడ్డి మాట్లాడుతూ భావితరాలకు ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ మొక్కలు నాటాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను బతికించే బాధ్యత అందరూ తీసుకుంటేనే కాలనీలు, బస్తీలు వనాలుగా మారుతాయన్నారు.వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్‌ డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్‌ అనీల్‌, మేనేజర్‌ విక్రమ్‌చంద్ర, జర్నలిస్ట్‌కాలనీ అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి,కోశాధికారి కై లాష్‌, జాయింట్‌ సెక్రెటరీ హన్మంత్‌రావు, సైదిరెడ్డి, సురేందర్‌, నర్సింహ, నాయకులు రవీందర్‌రావు, రఘునాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేష్‌, ధనలక్ష్మీ, తిరుపతి, జంగయ్య యాదవ్‌, శేఖర్‌, సత్యనారాయణతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో జోనల్‌ కమిషనర్‌ పర్యటన



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ్‌ చౌహాన్‌ మంగళవారం ప్రశాంత్‌నగర్‌ కోర్టు మార్గంలో వాటర్‌ లాగింగ్‌ ప్రాంతాన్ని సందర్శించారు. ఇటీవల నిర్మించిన వాటర్‌ కల్వర్టు, డబుల్‌ రోడ్డుకు సంబంధించిన రోడ్డు మార్గాల్లో ఉన్న వాటర్‌ స్టాగినేషన్‌ పాయింట్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సాపూర్‌ క్రాస్‌ రోడ్డులో, హోలిస్టిక్‌ హాస్పిటల్‌ మార్గంలో స్ట్రామ్‌ వాటర్‌ డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం హైదర్‌నగర్‌ వద్ద నిజంపేట్‌ రోడ్డు మార్గంలో, ఆల్విన్‌కాలనీ ఇండియన్‌ బ్యాంక్‌ వద్ద వాటర్‌ స్టాగినేషన్‌ పాయింట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌సీసీ పైపులైన్‌ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఈ గోవర్ధన్‌గౌడ్‌, డీసీ క్రిష్ణయ్య, డీఈ బాలకిషన్‌, ఏఈలు శివప్రకాష్‌, శ్రావణి, రషీద్‌, ఏఎంఓహెచ్‌ మమత, ఎస్‌ఎస్‌ మనోహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ప్రగతి కళాశాల విద్యార్థుల ప్రతిభ

కూకట్‌పల్లి: ఎన్‌సీసీలో ప్రగతి డిగ్రీ కళాశాల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. కళాశాల నుంచి ఇటీవల భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్‌ పరీక్షలో పాల్గొన్న 43 మంది విద్యార్థులు ఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణులు అయ్యారు. ఈ సందర్భంగా 4వ తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్‌ కమాండిగ్‌ అధికారి కల్నల్‌ ఆశిష్‌ కుమార్‌ తిపాఠి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌రావు వారిని అభినందించారు. విద్యార్థుల విజయానికి కారణమైన కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్‌ డి. రత్నాజాన్‌, ప్రిన్సిపాల్‌, ఆర్మీ అధికారులు, సహ అధ్యాపకులు అభినందించారు.